క్లుప్తంగా

దేవుని ప్రార్థనలో ప్రతి ఒక్కరూ పరిశుద్ధులు


జీవన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఏసు ప్రేమాలయం సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్‌: దేవుని ప్రార్థనలో ప్రతి ఒక్కరూ పరిశుద్ధులు కావాలని ఆంధ్రప్రదేశ్‌ పాస్టర్స్‌ ఫెడరేషన్‌ ప్రధాన కార్యదర్శి రెవరెండ్‌ జీవన్‌కుమార్‌ అన్నారు. పట్టణంలోని అంబటి సత్రం జంక్షన్‌లో ఉన్న ఏసు ప్రేమాలయంలో సోమవారం నిర్వహించిన ఆరాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఏసు ప్రేమాలయం ప్రతినిధులు రెవరెండ్‌ జీవన్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్‌ అలజంగి రవికుమార్‌, సిస్టర్‌ సువర్ణ, కోరాడ నాగేశ్వరరావు, విక్టర్‌ బాబు, జాన్‌ కొర్నేలి, పెంకి దేవరాజు, కలివరపు కిశోర్‌, ఝాన్సీ, సుజాన్‌, నిశాంత్‌, డేవిడ్‌ తదితరులు పాల్గొన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ


పూసపాటిరేగ: నడిపల్లిలో దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని నడిపల్లి గ్రామంలో లంకలపల్లి శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో సుమరు 300 మంది నిరుపేదలకు సోమవారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఏటా సంక్రాంతి పండగకు పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


రామతీర్థం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్‌: మండలంలోని రామతీర్థం ఉన్నత పాఠశాల ఆవరణంలో 1998–99 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చిన సందర్భంగా వారంతా పాఠశాల ఆవరణంలో ఒకరినొకరు నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై రాంబాబు, ఉపాధ్యాయులు రమేష్‌, బీఎస్‌ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంగిడీ రాళ్లు ఎత్తే పోటీలు


అంబటివలసలో సంగిడిరాయి ఎత్తుతున్న క్రీడాకారులు

బొండపల్లి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అంబటివలస గ్రామంలో సోమవారం జిల్లాస్థాయి సంగిడీ రాళ్లు ఎత్తే పోటీలు నిర్వహించారు. సుమారు 100 మంది గ్రామీణ క్రీడాకారులు 100–150 కేజీల రాళ్లను ఒంటి చేత్తో ఎత్తి బలప్రదర్శన చూపారు. విజేతలకు మంగళవారం నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

నాయుడుబాబు పుట్టినరోజు వేడుకలు


నాయుడుబాబును సత్కరిస్తున్న వేపాడ,ఎల్‌.కోట మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తవలస: రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్‌ చైర్మన్‌ నెక్కల నాయుడుబాబు పుట్టినరోజు వేడుకలను ఆయన స్వగ్రామం రామలింగాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు,అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌.కోట నియోజకవర్గం పరిధిలోని అయిదు మండలాల్లోని ముఖ్య నాయకులు, అభిమానులతో పాటు అనకాపల్లి జిల్లా కొటపాడు, దేవరాపల్లి మండ లాలకు చెందిన అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బాలఅన్నమ్మకు బోనాలు సమర్పణ

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో బాలఅన్నమ్మ పేరంటాలకు భోగి బోనాలు ఆదివారం సమర్పించారు. ఏటా సంక్రాంతి పర్వదినాన ఇలా అమ్మవారికి బోనాలు చెల్లిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


బోనాలు చెల్లిస్తున్న భక్తులు


జనసంచారం లేక బోసిపోయిన కోట ప్రాంతం


వ్యాపారాలు లేక వెలవెలపోతున్న ఫుట్‌పాత్‌లు


నగరపాలక సంస్థ రోడ్డులో..


గూడ్స్‌షెడ్డులో అంతంత మాత్రంగా ఉన్న ప్రయాణికులు


రైల్వేస్టేషన్‌ వద్ద నిర్మానుష్యం

బోసిపోయిన నగరం

సంక్రాంతి పండగకు పట్టణంలో నివాసముంటున్న వాళ్లంతా సొంతూళ్లకు వెళ్లడంతో పట్టణం బోసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారితో నిత్యం రద్దీగా ఉండే రహదారులు నిర్మానుష్యంగా మారాయి. పక్షం రోజులుగా కొనుగోలుదారులతో కళకళలాడిన మార్కెట్లు వెలవెలబోయాయి. నిత్యం రద్దీగా ఉండే గంట స్తంభం జంక్షన్‌, మెయిన్‌రోడ్‌, పీడబ్ల్యూ మార్కెట్‌, కోట జంక్షన్‌, మూడులాంతర్ల జంక్షన్‌ తదితర ప్రాంతాలు కర్ఫ్యూను తలపించేలా మారిపోయాయి.

– విజయనగరం


నిర్మానుష్యంగా మారిన మయూరి కూడలి రోడ్డు

తొలగిన తాగునీటి ఇక్కట్లు

- అమృత్‌ పథకం నిధులతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- 600 ఇంటర్‌ కనెక్షన్లతో అన్ని ప్రాంతాల ప్రజలకు వ్యక్తిగత కుళాయిలు
- పెరిగిన నీటి నిల్వ, పంపింగ్‌ సామర్థ్యం
- గత ప్రభుత్వంలో 5 రోజులకోసారి నీటి సరఫరా


నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్లను ప్రారంభిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి (ఫైల్‌)

విజయనగరం:

నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా అన్ని వార్డుల్లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వంలో ఐదురోజుల కోసారి కుళాయిల ద్వారా నీరు సరఫరా చేయగా.. ప్రస్తుతం రోజు విడిచి రోజు పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల చొరవతో..

గతంలో విజయనగరంలో తాగునీటి ఎద్దడి విపరీతంగా ఉండేది. ఎప్పుడు కుళాయిలు వస్తాయో.. ఎప్పుడు మొరాయిస్తాయో తెలియని పరిస్థితి. మహిళలు పనులు మానుకుని కుళాయి పాటింట్ల వద్ద రోజంతా నిరీక్షించేవారు. వేసవిలో అయితే నీటి కష్టాలు మరింత అధికమయ్యేవి. ప్రజల తాగునీటి ఇబ్బందులు దగ్గర నుంచి చూసిన కోలగట్ల వీరభద్రస్వామి.. 2019లో ఎన్నికల ప్రచారంలో తాను ఎమ్మెల్యేగా గెలుపొందితే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యేగా గెలుపొందిన మరుక్షణం నుంచే తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్‌ అధికారులతో సమావేశమై ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. అమృత్‌ పథకం నిధులతో నగరంలో దాసన్నపేట, చెంచుల కాలనీ తదితర ప్రాంతాల్లో వాటర్‌ ట్యాంకులను నిర్మించారు. అంతేకాకుండా నగర వ్యాప్తంగా 600 వరకు ఇంటర్‌ కనెక్షన్లను ఏర్పాటు చేశారు. పంపింగ్‌ సామర్థ్యాన్ని పెంచారు. రూ.200 లకే ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కుళాయి కనెక్షన్‌ కోసం దరఖాస్తు చేసుంటే, సంబంధిత అధికారులు దాన్ని పరిశీలించి వెంటనే కుళాయి ఏర్పాటు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్‌ ఏర్పాటు కావడంతో తాగునీటి కష్టాలు తొలగిపోయాయి. పండగ సమయంలో పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

లీకుల నివారణపై దృష్టి

వేసవిలో కూడా రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరిగే విధంగా ఇంజినీరింగ్‌ అధికారులతో సమాలోచనలు జరిపారు. ముసిడిపల్లి నుండి అధిక ప్రాంతాలకు తాగునీటి పంపిణీ జరుగుతోంది. ఇటీవల ముసిడిపల్లి ప్రాంతంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇంజినీరింగ్‌, ఆర్‌అండ్‌బీ, కార్పొరేటర్ల సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. నగరంలోని అన్ని పైపులైన్లను నిశితంగా పరిశీలించి లీకుల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కోలగట్ల ఆదేశించారు. 40 ఏళ్లుగా తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్న బుచ్చన్న కోనేరు ప్రాంతంలో ఇటీవల కోలగట్ల చొరవతో అధికారులు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడంతో స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సంతోషాల సంక్రాంతి

తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సంక్రాంతి పండగను ప్రతి ఒక్కరూ సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి సందడి చేశారు. పితృదేవతలను స్మరించుకుంటూ వారికి పూజలు చేశారు. బంధువులు, స్నేహితులతో ఇళ్లు కళకళలాడాయి. వాకిళ్లలో వేసిన రంగు రంగుల రంగవల్లులు, ఆకాశంలో ఎగురవేసిన పతంగులు, హరిదాసు కీర్తనలు, డూడూబసవన్న విన్యాసాలతో పల్లెలు, పట్టణాల్లో పండగ శోభ నెలకొంది. కనుమ రోజు గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. సంబరాల్లో భాగంగా పలుచోట్ల ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

– విజయనగరం, నెల్లిమర్ల నెట్‌వర్క్‌


పూసపాటిరేగ: పేరాపురంలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందచేస్తున్న సర్పంచ్‌ శ్రీరాం


నెల్లిమర్ల రూరల్‌: మల్యాడలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న సర్పంచ్‌ బలరాం


నెల్లిమర్ల రూరల్‌: మొయిదలో కళాకారులకు సన్మానం చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు


డెంకాడ: పినతాడివాడలో సంక్రాంతి సంబరాల్లో గ్రామస్తులు

ఆర్థిక సహాయం

వేపాడ: స్థానిక ఉన్నత పాఠశాలలో 1984లో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు తమ బ్యాచ్‌కు చెందిన మిత్రుల్లో ఆపదలో ఉన్న రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం చేశారు. తమ మిత్రుడు వేపాడ గ్రామస్తుడు బండారు సూర్యనారాయణ కుమారుడు దివ్యాంగుడు కావడంతో రూ.15 వేలు అందజేశారు. అలాగే మరో మిత్రుడు వేపాడకి చెందిన ఆదపురెడ్డి ఈశ్వరరావు భార్య క్యాన్సర్‌తో బాధ పడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు సహాయం చేశారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ తమతో కలిసి చదువుకున్న మిత్రుల్లో కష్టాల్లో ఉన్నవారికి అంతా అండగా ఉండాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.


తోటి మిత్రుడి కుమారుడు దివ్యాంగుడికి నగదు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

వీరజవాన్లను గుర్తుంచుకోవాలి

చీపురుపల్లి: దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన వీర జవాన్లను దేశ ప్రజలు నిరంతరం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని ఆశయ యూత్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. పట్టణంలోని జి.వి.ఆర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఆవరణలో ఇండియన్‌ ఆర్మీ డేను ఆదివారం నిర్వహించారు. యువత జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రెడ్డి రమణ మాట్లాడుతూ యువత దేశ రక్షణ కోసం ఆర్మీలో చేరాలని కోరారు. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన జవాన్లకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో హేమంత్‌, నవీన్‌, తదితరులు పాల్గొన్నారు.


జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న యువత

ఆకట్టుకున్న ఎడ్ల పరుగు ప్రదర్శన


పోటీల్లో పరుగు తీస్తున్న ఎద్దులు

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో కృష్ణరాయుడు తీర్థమహోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శ న ఆకట్టుకుంది. పోటీల్లో అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 16 జతల ఎద్దు పాల్గొనగా వల్లంపూడికి చెందిన ఏడువాక సత్తిబాబు ఎడ్లు విజేతగా నిలిచాయి. ద్వితీయ, తృతీయ స్థానాల్లో అనకాపల్లి జిల్లా చెందిన నరసయ్యపేటకు చెందిన ముమ్మన రామకృష్ణ, లెక్కలవానిపాలెంకు చెందిన లెక్కల సత్తిబాబు ఎడ్లు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు ప్రథమ బహుమతిగా రూ.12 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.8 వేలు అందజేశారు. తీర్థం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి తీర్థం

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వద్ద గ్రామ పెద్దల సమక్షంలో స్వామివారి తీర్థమహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఏటా కనుమ పండగరోజు ఈ తీర్థం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు చెబుతున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి సోమవారం ఉదయం నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులతో విశేష పూజలు చేయించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెట గుళ్ళు, చిడతల భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


పూజలు అందుకుంటున్న సీతారామచంద్రస్వామి

నేడు సోమలింగాపురానికి మంత్రి బొత్స రాక

మెరకముడిదాం: రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ మండలంలోని సోమలింగాపురానికి మంగళవారం రానున్నారని ఎంపీటీసీ ఎస్‌.సీతారామరాజు, నాయకులు ఎస్‌.కృష్ణమూర్తిరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా సంక్రాంతి పండగకు డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ ఎస్‌.వి.రమణరాజు ఇంటికి మంత్రి బొత్స వచ్చి ఆతిథ్యం స్వీకరిస్తారని, ఈ ఏడాది కూడా మంత్రి వస్తున్నారని పేర్కొన్నారు.

నేడు అమ్మవార్ల తీర్థ మహోత్సవం

జామి: మండలంలోని ఎం.కె.వలస గ్రామంలో కన్నమ్మతల్లి, శిరికిపాలెంలో కొత్తమ్మ తల్లి, చింతాడలో మల్లికార్జునస్వామి తీర్థమహోత్సవాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు సోమవారం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

రైతువాణి క్యాలెండర్‌ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్‌ చినరామునాయుడు

వేపాడ: ఏపీ రైతు సంఘానికి సంబంధించిన రైతువాణి క్యాలెండర్‌, డైరీను ఆ సంఘం జిల్లా కార్యదర్శి చల్లా జగన్‌ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్‌ వేచలపు వెంకట చినరామునాయుడు నీలకంఠరాజపురంలో సోమ వారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట చినరామునాయుడు మాట్లాడుతూ సాగు సలహాలు, సూచనలతో రైతులకు ఉపయోగపడే విధంగా సంఘ సభ్యులు క్యాలెండర్‌ రూపొందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బి.రాంబాబు, ఉప సర్పంచ్‌ కండిపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

రేగిడి: వైఎస్సార్‌ సీపీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని మండల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల అబ్జర్వర్‌ పాలవలస రామచంద్రినాయుడు అన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి, ఈ పదవిని కట్టబెట్టిన పార్టీ కేంద్ర పాలక మండలి సభ్యుడు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. రేగిడి మండల నాయకుల సూచనలు, సలహాలతో అన్ని గ్రామాల గృహ సారథులు, గ్రామ సచివాలయాల కన్వీనర్లతో కలిసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు.

ఘనంగా గోవర్ధనగిరి జాతర

సంతకవిటి: మండలంలోని గోవిందపురం గ్రామంలో గోవర్ధన గిరి జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో యాత్రలో పాల్గొన్న భక్తులు కొండపై కొలువైన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరను తరతరాలుగా ధర్మకర్తలు ఊడు తవిటమ్మ, లక్ష్మణరావు, కృష్ణారావు, సత్యనారాయణ నిర్వహిస్తుండడం గమనార్హం. జాతర నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్‌ రాగోలు పద్మజరమేష్‌నాయుడు తెలిపారు.


గోవర్ధనగిరి జాతరలో భక్తులు

ఏపీటీజీ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణదాస్‌

బొబ్బిలి రూరల్‌: ఆంధ్రప్రదేశ్‌ టీచర్స్‌ గిల్డ్‌(ఏపీటీజీ) జిల్లా అధ్యక్షుడిగా అలజంగి సీబీఎం పాఠశాల హెచ్‌ఎం కె.కృష్ణదాస్‌ నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీటీజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌.కె.చిన్నప్ప నాయామక ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కృష్ణదాస్‌ మాట్లాడుతూ ఎయిడెడ్‌ ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులతో పాటు ఉపాధ్యాయ సమస్యలపై పోరాడతామన్నారు. కృష్ణదాస్‌ను సోమవారం పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

గోమాతకు పూజలు

రేగిడి: కనుమ పండగ సందర్భంగా మండలంలోని అంబకండి, రేగిడి, వన్నలి, ఉనుకూరు, సంకిలి గ్రామాల్లో సోమవారం గోమాతకు పూజలు చేశారు. గోవును పూజిస్తే ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగడంతో పాటు పంటలు బాగా పండుతాయనే నమ్మకంతోనే ప్రజలు పూజిస్తారు.

వంగర: మండలంలోని సంగాం గ్రామ సంగమేశ్వరాలయం వద్ద సోమవారం గోమాత పూజలు నిర్వహించారు. పాడిఆవులకు స్నానం చేయించి, పసుపు, కుంకుమలతో పూజించారు.


రేగిడి: గోమాతను పూజిస్తున్న మహిళా రైతు


వంగర: సంగాంలోని సంగమేశ్వరాలయంలో గోమాత పూజలు